క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్న అధికారులు

లక్కవరపుకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున సమావేశంలో ఎలాంటి కొత్త పనులు, పథకాలకు సంబంధించిన తీర్మానాలు చేయలేదు. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంను వేగవం తం చేయాలని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సూచించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ఎంపీడీఓ కె.రూపేష్, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్స్ డే



ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న కార్పెంటర్స్ యూనియన్ నాయకులు

గజపతినగరం: మండల కేంద్రంలో కార్పెంటర్స్‌డేను ఏపీ కార్పెంటర్స్, వడ్రంగి అసోసియేషన్, వీరబ్రహ్మేంద్రస్వామి యూనియన్ జిల్లా కన్వీనర్ అండ్లూరి గణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పురిటిపెంట సచివాలయంలో ఉచితంగా రిపేర్లు చేశారు. ఏపీ కార్పెంటర్స్ మండల అధ్యక్షుడు కె.అప్పలాచారి, ఉపాధ్యక్షుడు అరికతోట జగదీష్, నాయకులు సింహాద్రి సన్యాసిరావు, పారాది శ్రీను, సూరిబాబు, వేమలి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక విగ్రహ ప్రతిష్ఠ



వినాయకుడ్ని దర్శించుకున్న సర్పంచ్ దంపతులు, తదితరులు

వేపాడ : మండలంలో వావిలపాడులో నూతనంగా నిర్మించిన ఆలయంలో వినాయక విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీల రాజేశ్వరి, సతీష్ దంపతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాగి పిండి పంపిణీ చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మావతి, సీఎస్‌డీటీ రామారావు

మెరకముడిదాం: రేషన్ లబ్ధిదారులకు ఏప్రిల్ నెల నుంచి రాగి పిండిని పంపిణీ చేయాలని తహసీల్దార్ వై.వి.పద్మావతి, సీఎస్‌డీటీ పిన్నింటి రామారావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్‌డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాల ఆపరేటర్ల సరుకులను సక్రమంగా తూకం వేసి లబ్ధిదారులకు అందించేలా చూడాలని డీలర్లకు సూచించారు. రేషన్‌కార్డుకు కిలో చొప్పున రాగిపిండి పంపిణీ చేయాలని చెప్పారు. అలాగే సాధారణ ఎన్నికల నిబంధనలు అమలువుతున్న దృష్ట్యా డీలర్లు, ఎండీయూ వాహనాల ఆపరేటర్లు ఏ రాజకీయపార్టీ కార్యక్రమాల్లోనూ పాల్గొనకూడదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్ : మండల పరిధిలోని వీటీ అగ్రహారం శివారులో పేకాటాడుతున్న పది మందిని రూరల్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై వాసుదేవ్ తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, రూరల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దాడులు ముమ్మరం

నెల్లిమర్ల: ఎస్ఈబీ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. గుర్ల మండలంలోని రొతుపేటలో బుధవారం దాడులు చేపట్టి 1400 లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారా గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం నెల్లిమర్ల ఎస్ఈబీ కార్యాలయంలో జరిగిన ఇన్‌స్పెక్టర్ పీటీవీ కుమార్ మాట్లాడుతూ... సారా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ వై. భాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుల్ వి. కృష్ణ , తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించండి

- మాట ఇస్తే నిలబడే వ్యక్తి సీఎం జగన్
- మోసం చేయడం చంద్రబాబు నైజం
- టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎంపీ బెల్లాన



షికారుగంజిలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



విజయరాంపురంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని, అనేక సంక్షేమ పథకాల ద్వారా పేదల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని విజయరాంపురం, షికారుగంజి, ఆర్.రామచంద్రాపురం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే అప్పలనరసయ్య తన కుమారుడు గురునాయుడు, నాయకులతో కలిసి విజయరాంపురంలో పరదేశమ్మ, బంగారమ్మ తల్లి,ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో ఎంపీ బెల్లాన మాట్లాడుతూ పేదల కోసం నిరంత రం తపించే వ్యక్తి సీఎం జగన్ అని అన్నారు. పేదింటి పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలనే ఉద్దేశంతో సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండడం, పేదలకు న్యాయం చేయాలన్నది సీఎం జగన్ నైజం కాగా.. ప్రజాధనాన్ని ఎలా దోచుకోవాలి, ఎలా మోసం చేయాలన్నదే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి నైజమన్నారు. 2014లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. 2019 ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారని చెప్పారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని, ఎంపీగా పోటీ చేయనున్న తనకు, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అప్పలనరసయ్యకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ప్రతి ఇంటికీ పథకాలు అందించాం

ఎమ్మెల్యే అప్పలనరసయ్య మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ పథకాలు అందించామని, గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిట కు తీసుకువచ్చామని చెప్పారు. ప్రతి నెలా ఉదయాన్నే తలుపు తట్టి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ అందచేస్తున్న వలంటీర్లపై లేని పోని మాట్లాడుతున్న టీడీపీ నాయకులకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. జిల్లాలోని బీసీలకు ఎమ్మెల్యే అభ్యర్థిగా టిక్కెట్లు ఇవ్వకుండా బీసీలను చంద్రబాబునాయుడు మోసం చేశారని అన్నారు. విజయరాంపురం, షికారుగంజి ఆర్.రామచంద్రాపురం సర్పంచ్‌లు గొర్లి సింహాచలం, సుంకరి వెంకటరావు, బేత శ్రీదేవి,ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ త్రినాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, నాయకులు కడుబండి రమేష్‌నాయుడు, నారాయణమూర్తిరాజు, ప్రభాజీరాజు తదితరులు పాల్గొన్నారు.



విజయరాంపురంలోని బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, తదితరులు

నేడు దత్తిలో..

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో గజపతినగరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స అప్పలనరయ్య గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామ, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తూ, నిరంతరం ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత బూత్ కమిటీ సభ్యులతో పాటు నాయకులపై ఉందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వల్లంపూడిలో 51 పోలింగ్ బూత్ కమిటీ సభ్యు లతో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని బూత్ కమిటీ సభ్యులు, నాయకులకు సూచించారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ సీఎం జగన్ నెరవేర్చారని, ప్రజలను ధైర్యంగా ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. నియోజకవర్గంలో 86 వేల కుటుంబాలు ఉంటే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 80 వేల కుటుంబాల ఇళ్లకు తాను నేరుగా వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడంతో పాటు పథకాలను వివరించానని చెప్పారు. అదే విధం గా బూత్ కమిటీ సభ్యులు, గ్రామ నాయకులు ప్రచారం నిర్వహించాల్సి ఉందన్నారు. 85 ఏళ్లు నిండిన వృద్ధులు ఇంటివద్దే ఓటు వేసుకునే సౌలభ్యం ఎన్నికల కమిషన్ కల్పించిందని, అటువంటి వారి కోసం ఎన్నికలకు పదిరోజులు ముందుగానే దరఖాస్తు చేయాలని చెప్పారు. పార్టీ గెలుపే ధ్యేయంగా అంతా కలిసి పని చేయాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ చినరాము నాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జగ్గుబాబు, మండల కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ వేచలపు రామ్మూర్తినాయుడు, మండల సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి గంగునాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు,నాయకులు దుల్ల కుమారి పాల్గొన్నారు.

రేవళ్లపాలెంలో అగ్ని ప్రమాదం

శృంగవరపుకోట : మండలంలోని రేవళ్లపాలెంలో బుధవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన చిటికిరెడ్డి అర్జున పూరిల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో నిత్యావసర సామగ్రి, దుస్తులు, ధాన్యం కాలి బూడిదయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.



అగ్నిప్రమాదంలో కాలిపోయిన ఇల్లు

ముమ్మరంగా వాహన తనిఖీలు



గంట్యాడ: తామరపల్లి జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని తామరపల్లి జంక్షన్ వద్ద ఎస్ఐ సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాల్లో డబ్బు, మద్యం, ఓటర్లకు పంచేందుకు కానుకలు, పెద్ద ఎత్తున వస్తువులు వంటివి తరలించే అవకాశం ఉన్నందున ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గర్భాం జంక్షన్‌లో..



మెరకముడిదాం: గర్భాం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ లోకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది

మెరకముడిదాం: మండలంలోని గర్భాం జంక్షన్ వద్ద బుధరాయవలస ఎస్ఐ బి.లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి వరకు వాహన తనిఖీలు చేశారు. వాహనాల్లో ఏయే వస్తువులు తీసుకువెళుతున్నారో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహ నాల రికార్డులు, వాహన చోదకుల లైసెన్స్ పత్రాలను పరిశీలించారు.

అవగాహన తప్పనిసరి

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు తెలిపారు. జమ్ము జంక్షన్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న సిబ్బందికి అగ్నిప్రమాదాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.



పెట్రోల్ బంక్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారులు

గడ్డివాముల దగ్ధంపై కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం గడ్డివాములు దగ్ధమైన సంఘటనకు సంబంధించి బాధి త రైతు ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. రైతు మోపాడ శ్రీనివాసరావుకు చెందిన 16 గడ్డివాములు దగ్ధం కావడానికి అదే గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి మహేష్ అనే వ్యక్తి కారణమని రైతు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

31న భద్రకాళి, మజ్జిగౌరి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో ఉన్న భద్రకాళి,మజ్జిగౌరి అమ్మవార్ల గుడి వద్ద ఈనెల 31న జాతర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఆలయ ధర్మకర్త జగదీష్‌నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయనున్నామని, ఆరోజు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయండి



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: గ్రామాల్లో ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని కొత్తపాలెంలో బుధవారం ఆయన పర్యటించి, ఎన్నికల కోడ్ సక్రమంగా అమలవుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, అక్కడి ఉగ్యోగులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించేలా చూడాల్సిన బాధ్యత సచివాలయ కార్యదర్శులపై ఉందని ఎంపీడీఓ అన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ డి.వెంకటరమణ తదితరులు ఉన్నారు.

బంగారు వస్తువు అప్పగింత

విజయనగరం క్రైమ్: చేజార్చుకున్న బంగారు వస్తువును ట్రాఫిక్ పోలీసులు బాధితులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక చింతలవలస గుండాలపేటకు చెందిన రామునాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గంటస్తంభం వద్ద గల నగల దుకాణంలో అరతులం చైన్ బుధవారం కొనుగోలు చేశాడు. అనంతరం దుస్తులు కొనేందుకు వేరే దుకాణం వద్దకు వెళ్లి బంగారు వస్తువు జారవిడుచుకున్నాడు. ఆ వస్తువును ట్రాఫిక్ కానిస్టేబుల్ సత్యనారాయణ, హోంగార్డు కాశీ గుర్తించి విషయాన్ని ట్రాఫిక్ ఎస్సై లోవరాజుకు తెలియజేశారు. దీంతో బిల్ ఆధారంగా బంగారు దుకాణం వద్దకు వెళ్లి కొనుగోలు చేసిన వారిని గుర్తించారు. వెంటనే బాధితులకు ఫోన్ చేసి రప్పించి బంగారు వస్తువు అందజేశారు. దీంతో బాధితులు ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



బాధితులకు బంగారు వస్తువు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై లోవరాజు, కానిస్టేబుల్ సత్యనారాయణ, తదితరులు

అందుబాటులోకి బ్లడ్ బ్యాంక్

- రూ.75 లక్షలతో సీహెచ్‌సీ ఆవరణలో నిర్మాణం



అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన బ్లడ్‌బ్యాంక్

చీపురుపల్లి: స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స తీసుకునే వారికి అత్యవసర సమయాల్లో రక్తం కావాలంటే విజయనగరం, విశాఖపట్నం పరుగులు తీయాల్సిన పరిస్థితి గతంలో ఉండేది. సీహెచ్‌సీలో రక్త నిల్వ కేంద్రం ఉన్నప్పటికీ అరకొరగా బ్లడ్ ప్యాకెట్లను మాత్రమే నిల్వచేసే సదుపాయం ఉండేది. ఇక్కడి ఆస్పత్రిలో ప్రతి నెలా వందల సంఖ్యలో ప్రసవాలు జరుగుతుండడంతో పాటు అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలకు చెందిన క్షతగాత్రులు చేరుతుంటారు. ఇక్కడ అత్యవసర సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. అందుకే బ్లడ్ బ్యాంక్ అవసరమని స్థానిక ప్రజాప్రతినిధులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి గతంలో తీసుకెళ్లారు. తక్షణమే వారు స్పందించి, అరబిందో ఫార్మా ఫౌండేషన్ వ్యవస్థాపకులతో మాట్లాడి చీపురుపల్లిలో బ్లడ్ బ్యాంక్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీంతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకొచ్చి సీఎస్‌ఆర్ నిధులు రూ.75 లక్షలతో బ్లడ్ బ్యాంక్ భవనంతో పాటు యంత్రాలు, ఫర్నీచర్, మౌలిక వసతులు కల్పించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకు అప్పగించారు. కొద్ది రోజుల క్రితమే బ్లడ్ బ్యాంక్‌ను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. బ్లడ్ బ్యాంక్‌కు నిరంతర విద్యుత్ సరఫరా అవసరం ఉన్న నేపథ్యంలో జనరేటర్‌ను సమకూర్చాల్సి ఉంది. జనరేటర్ సదుపాయం కల్పించే పనిలో ప్రజాప్రతినిధులు ఉన్నారు. త్వరలో ఇక్కడ సేవలు ప్రారంభంకానున్నాయి.

అవినీతి రహిత పాలన అందించాం..



సంతపాలెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- మరింత సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తాం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: గడిచిన అయిదేళ్లలో అవినీతి రహిత, వివక్షత లేని, సంక్షేమపాలన అందించామని, రానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించి గెలిపిస్తే మరింత సంక్షే మం,అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంతపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం పార్టీ నాయకుల తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. జై జగన్, జై వైఎ స్సార్‌సీపీ అంటూ నినాదాల మధ్య ఉత్సాహంగా ప్రచారం సాగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోన్‌రెడ్డి పాలన సాగించారని అన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చామని చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందించామని, గ్రామసచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే ప్రజలకు అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. మళ్లీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. గత టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య తేడాలను గుర్తించాలని ప్రజలకు సూచించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తనను, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల యూత్ ప్రెసిడెంట్ అనిల్, గ్రామ సర్పంచ్ బొడ్డ చాముండేశ్వరి, ఎంపీటీసీ ఎస్.వెంకటరమణ, నాయకులు బి.ఏ.నాయుడు, పల్లా భీష్మ, డి.ఎం.నాయుడు, వెంకన్నపాత్రుడు, జి.త్రిమూర్తులు, పెదిరెడ్ల శ్రీనివాసరావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

- డీఎస్పీ గోవిందరావు



వేపాడ: బొద్దాంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు



దత్తిరాజేరు: ఎస్ చింతలవలసలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్

వేపాడ : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని డీఎస్పీ గోవిందరావు కోరారు. మండలంలోని బొద్దాం, పాటూరు గ్రామాల్లో బుధవారం రాత్రి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చవద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలోఎస్.కోట రూరల్ సీఐ ఉపేంద్ర, వల్లంపూడి ఎస్సై రాజేష్, గ్రామస్తులు, యువకులు మహిళలు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించరాదు..

దత్తిరాజేరు: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మీప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని ఎస్. చింతలవలసలో ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పించారు. యువత తగాదాలకు దూరంగా ఉండాలని సూచించారు.



బొండపల్లి: గరుడుబిల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

స్వేచ్ఛగా ఓటు వేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు.

కేసుల్లో ఇరుక్కోవద్దు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమించి, గొడవలు, తగాదాలకు పోయి కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్ఐ కె.లక్ష్మణ రావు ప్రజలకు సూచించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో ఎన్నికల నిబంధనలపై గ్రామస్తులకు బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా సహకరించాలని ప్రజలను కోరారు.

పుస్తకాల పంపిణీ

లక్కవరపుకోట : మండలంలోని తలారి గ్రామానికి చెందిన విద్యార్థులకు విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న గుమ్మడి రమేష్ వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను బుధవారం అందజేశారు. చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అలాగే గ్రామంలోని పాఠశాలకు బోర్డు, ఆట వస్తువులు కూడా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుమ్మడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.